469) లలిత

ప॥ ఎట్టు వలసిన జేయు మిన్నియు నీచిత్తమె । నెట్టనె నొకడనా నీవే యింతాను ॥

చ॥ వేవేలు నీకు విన్నవించేదేమి తొల్లే । సావధానముగ సర్వసాక్షివి నీవు ।
ఆవల నా కిటుసేయమైని చెప్పేదేమి నేను । దైవికమైనట్టిస్వతంత్రుడవు నీవు ॥

చ॥ తగిలి నిన్ను ధ్యానించేదేమి తొల్లె । జగతి నీవు పూర్ణచైతన్యుడవు ।
జిగి నీనామము నోర జిక్కించి నుడిగేదేమి । మగుడి శబ్దాక్షరమంత్రరూపుడవు ॥

చ॥ చేవమీర సిరుల బూజించేదేమి నిన్ను । శ్రీవేంకటేశ నీవు శ్రీపతివి ।
దేవదేవ నిన్ను నీవే తేకువెల్లా నెంచుకొని । కావుము నీ వొక్కడవే కరుణానిధివి ॥